క్లుప్తంగా

పట్టా భూములుగా గుర్తించాలని వినతి

నెల్లూరు(అర్బన్): ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపారంటూ బోగోలు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన పలువురు రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళనను మంగళవారం చేపట్టారు. జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం రైతులు వెంకయ్య, రాజేష్ మాట్లాడారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు దశాబ్దాల క్రితమే పట్టాలను ఇచ్చారని చెప్పారు. అవి ఒకరిద్దరి చేతులు మారాయని, రిజిస్ట్రేషన్లు సైతం జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపుతుండటం తగదన్నారు. సదరు భూములను పట్టా భూములుగా గుర్తించాలని కోరారు. రైతులు కృష్ణయ్య, ప్రసాద్, మురళి, చైతన్య, శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఏటీఎం కేంద్రం ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేటలోని తడికలబజార్ సెంటర్‌లో డీసీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్‌ను సీఈఓ శంకర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. జీఎం సరిత, ఆప్కాబ్ అధికారి శ్రీనివాస్, ఏజీఎం మధుసూదన్‌రావు, డీసీసీబీ స్టోన్‌హౌస్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అత్యధిక వడ్డీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సూపర్ సీనియర్ సిటిజన్ల కోసం నూతన పథకాన్ని డీసీసీబీలో బుధవారం ప్రారంభించనున్నామని సీఈఓ శంకర్‌బాబు పేర్కొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని డీసీసీబీలో గల తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 80 ఏళ్లపైబడిన సీనియర్ సిటిజన్ల కోసం సూపర్ సీనియర్ సిటిజన్ల డిపాజిట్ పథకాన్ని ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. నగదు డిపాజిట్లపై అత్యధికంగా 8.25 శాతం వడ్డీని అందించనున్నామని చెప్పారు. సాధారణ డిపాజిట్లపై అదనంగా 0.5 శాతం వడ్డీని అందించనున్నామని వివరించారు. 271 నుంచి 364 రోజుల వరకు డిపాజిట్ చేస్తే గతంలో 5.5 శాతం వడ్డీని చెల్లించేవారమని, దీన్ని ఆరు శాతానికి పెంచామని పేర్కొన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు డిపాజిట్ చేసిన వారికి 6.5 నుంచి ఏడు శాతం, రెండేళ్లు, ఆపైన 7.5 శాతం వడ్డీని అందించనున్నామన్నారు. వ్యవసాయ రుణాలకు సంబంధించి గ్రాము బంగారానికి రూ.3500తో రూ.ఐదు లక్షల వరకు రుణాన్ని 7.95 శాతం వడ్డీకి ఇస్తామన్నారు. వ్యవసాయేతర అవసరాలకు బంగారు ఆభరణాలపై తొమ్మిది శాతం వడ్డీతో రూ.20 లక్షల వరకు రుణాలను అందించనున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించడంతో పాటు దాడి చేసిన వారిపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళేనికి చెందిన రాజేశ్వరికి కృష్ణప్రసాద్‌తో 2018లో వివాహమైంది. కొంతకాలం వీరు సంతోషంగా జీవించారు. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. అదనపు కట్నం కోసం రాజేశ్వరిని కృష్ణప్రసాద్, అతని తల్లిదండ్రులు, తమ్ముడు వేధించసాగారు. ఇటీవల ఆమెపై దాడి చేసి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళపై ఆమె భర్త మొదటి భార్య, కుమారుడు దాడి చేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌లోని రాయపుపాళేనికి చెందిన రమణయ్యకు రాజేశ్వరితో గతంలో వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో వీరు విడిపోయారు. అనంతరం సుమతిని వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి, ఆమె కుమారుడు శ్రీకాంత్ ఈ నెల ఐదో తేదీన రమణయ్య ఇంటికెళ్లారు. అక్రమంగా ప్రవేశించి అందులో ఉన్న సామగ్రిని తీసుకెళ్తుండగా, సుమతి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని యునైటెడ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత, గిరిజన సంఘాల నేతలు అరుణాచలం, సుబ్బారావు, సుబ్బరాయుడు, జయరాజ్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, ప్రమీలమ్మ, నిర్మలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్య సమస్యలకు చెక్



కొడవలూరు: సైకిల్ ర్యాలీలో వైద్యాధికారి, తదితరులు

కొడవలూరు: వ్యాయామంతో అనేక ఆరోగ్య సమస్యలకు కళ్లెం వేయొచ్చని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. కేన్సర్, బీపీ, షుగర్‌పై అవగాహన కల్పించే నిమిత్తం సైకిల్ ర్యాలీని కొడవలూరులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాయామంతో బీపీ, షుగర్, ఒత్తిడిని నియంత్రించుకొని మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. సీహెచ్‌ఓ సోమశేఖర్, హెల్త్ విజిటర్లు పద్మ, సుజాత, ఎమ్మెల్‌హెచ్‌పీలు స్నేహ, సరోజ, రేష్మా, రషీదా, ఏఎన్‌ఎంలు దీనా, సలోమి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: కేన్సర్‌పై అవగాహన ర్యాలీని మహ్మదాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడారు. ప్రతి గ్రామంలో తమ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, బోధకులు కనకరత్నం, పర్యవేక్షకులు శ్రీనివాసులు, అనూరాధ, రమణమ్మ, నరసమ్మ, మస్తాన్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీహెచ్‌ఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తోటపల్లిగూడూరు ఉన్నత పాఠశాలలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: ప్రతి ఒక్కరూ సైకిల్‌ను తొక్కే అలవాటు చేసుకుంటే కేన్సర్ లాంటి వ్యాధులొచ్చే అవకాశాలు తగ్గుతాయని ఎంపీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బందితో కలిసి మనుబోలులో ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు గేయపూజిత, సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరులో..


తోటపల్లిగూడూరులో..


మనుబోలులో..

నరసాపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ యామిని ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయసేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయసేవలను అందిస్తున్నామని వివరించారు. వీఆర్వో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు: బ్యాంకులు అందిస్తున్న సేవలపై రైతులు అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత జిల్లా కో ఆర్డినేటర్ రవిశంకర్ పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై రైతులు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని కోవూరులోని శాంతినగర్‌లో గల పడుగుపాడు సహకార పరపతి సంఘ సమావేశ మందిరంలో ఆర్బీఐ సూచనల మేరకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు, ఖాతాదారులు కేవలం నియంత్రణ సంస్థల నుంచే రుణాలను తీసుకోవాలని కోరారు. డిజిటల్ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడారు. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు రూ.మూడు కోట్ల మేర బంగారు రుణాలను అందజేశామని వెల్లడించారు. కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవిశంకర్

వీర జవాన్లకు నివాళులు

వెంకటాచలం: కశ్మీర్‌లోని పుల్వామాలో నాలుగేళ్ల క్రితం ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వీర జవాన్లకు కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో ఆంధ్రా విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ఆంధ్రా విద్యార్థి సంఘ అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సుందరవల్లి, తదితరులు

బాబోయ్.. కుక్కలు

పొదలకూరు: పట్టణంలో కుక్కల బెడద నానాటికీ తీవ్రమవుతోంది. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వందల సంఖ్యలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో కొత్త వ్యక్తులపై దాడి చేస్తున్నాయి. కుక్క కాటుకు గురైన వారు వ్యాక్సిన్ కోసం ప్రభుత్వాస్పత్రికి పరుగులు తీస్తున్నారు. ఇటీవలే ఓ పిచ్చి కుక్క పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సంచరించి పలువురిపై దాడి చేసింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్నికల నియమావళిని పాటించండి

ఇందుకూరుపేట: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని తహసీల్దార్ సుబ్బయ్య కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్‌పై వివరించారు. ఎంపీడీఓ కల్పన, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బయ్య

ముగిసిన గ్రిగ్స్ పోటీలు


హోరాహోరీగా కబడ్డీ పోటీలు


విజేతలుగా నిలిచిన గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఇందుకూరుపేట: నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సాయంతో మూడు రోజుల పాటు నిర్వహించిన కోవూరు జోన్ గ్రిగ్స్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానికుడు కల్యాణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షులు ఝాన్సీలత, కార్యదర్శి పల్లవి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడారు. ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు మండలాలకు చెందిన 37 పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఈ నెల 20న నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు.

ముస్తాబైన పంచలింగేశ్వరాలయం

పొదలకూరు: మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో గల పంచలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని గ్రామపెద్దలు ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో దేవస్థానాన్ని తీర్చిదిద్ది ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు సిద్ధం చేశారు. దేవస్థానానికి ఎంతో చరిత్ర ఉంది. చోళుల కాలంలో ఇక్కడ శివాలయాన్ని నిర్మించారనే ఆనవాళ్లు ఉన్నాయి. మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్ల కల్యాణం, గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మనుబోలుకు మంత్రి కాకాణి రాక నేడు

మనుబోలు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మనుబోలుకు బుధవారం రానున్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సీపీఆర్ కల్యాణ మండపంలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారు.

పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు



పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మ తల్లికి చిట్టేపల్లి భక్తులు సామూహిక పొంగళ్లను మంగళవారం పెట్టారు. పూజా సామగ్రితో బాణసంచా, తప్పెట్లతో కాలినడకన గ్రామం నుంచి బయల్దేరి దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. తీర్థప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతినగర్‌లో కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. ఆకుపూజ, అభిషేకాలు, పల్లకిసేవ, తదితరాలను జరిపారు. భక్తులు భారీగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

1006 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షకు 1006 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి ప్రభాకర్ తెలిపారు. 9737 మందికి గానూ 8731 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

వరకవిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

తోటపల్లిగూడూరు: వరకవిపూడి సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం నిర్వహించనున్నారని ఎంపీడీఓ హేమలత మంగళవారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నేడు

కోవూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ పద్మజ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కొడవలూరు: మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పుట్ట మట్టిని తెచ్చి నవధాన్యాలతో కలిపి కలశంలో నింపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు శేషవాహన సేవను బుధవారం నిర్వహించనున్నామని ఈఓ శాంతయ్య తెలిపారు. ధ్వజారోహణను ఉదయం నిర్వహించనున్నామని చెప్పారు. అర్చకులు సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

1.18 కోట్ల పనిదినాలే లక్ష్యం

మనుబోలు: జిల్లాలో ఈ ఏడాది 1.18 కోట్ల పనిదినాలే లక్ష్యమని డ్వామా పీడీ వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని పిడూరులో రూ.1.5 లక్షలతో నిర్మిస్తున్న క్యాటిల్ పాండ్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు గానూ ఎండిపోయిన చెరువుల్లో నీటి గుంతలను తవ్విస్తామన్నారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కనీస వేతనంగా రూ.257 అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి స్థానికులు కోరిన పనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వీలు బట్టి రెండు పూటలా పనులు చేసుకోవచ్చన్నారు. ఏపీఓ రాజమ్మ, టీఏలు సుప్రజ, రమేష్, ఎఫ్‌ఏలు వేణు, శ్రీనివాస్, హరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న వెంకట్రావు

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామకృష్ణనగర్‌లో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వివరాలను మంగళవారం వారు తెలియజేశారు. 15న అంకురార్పణ, 16న ధ్వజారోహణ, 17న సూర్యప్రభవాహనం, 18న కల్పవృక్ష వాహనం, 19న చంద్రప్రభ వాహనం, 20న హనుమంతసేవ, 21న మోహినీ అవతారం, 22న కల్యాణం, 23న రథోత్సవం, 24న చక్రస్నానం, 25న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని చెప్పారు.


ముస్తాబైన దేవస్థానం

రూ.20 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు


మాట్లాడుతున్న అధికారులు

ముత్తుకూరు: జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.20.93 కోట్లతో 54 పనులను మండలంలో చేపట్టామని అధికారులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సుగుణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధుసూదన్ మాట్లాడారు. నాడు – నేడు రెండో విడత ద్వారా మండలంలోని 50 పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నామని, దీనికి ప్రభుత్వం రూ.12 కోట్లను వెచ్చిస్తోందని వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు 527 ట్యాబ్‌లను పంపిణీ చేశామని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణను రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి మాట్లాడారు. రబీ సీజన్లో మండలంలో 9200 ఎకరాల్లో వరి, వేరుశనగను సాగు చేస్తున్నారన్నారు. పురుగు మందుల పిచికారీ కోసం 40 శాతం రాయితీపై డ్రోన్లను పంపిణీ చేస్తామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పీఆర్, పొదుపు సంఘాల పనితీరుపై సమీక్షించారు. ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ మనోహర్‌బాబు, మండల ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, విజయలక్ష్మి, హార్టికల్చర్ వర్సిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా మెరుగైన సేవలు

కోవూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన పురుగు మందులను సరఫరా చేయడమే కాకుండా మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అమరావతి డీడీఏ మురళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 110 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని, అతి త్వరలో మరో 65 అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. కోవూరులో ఇప్పటి వరకు 112 పరీక్షలు చేశారన్నారు. ల్యాబ్ టెస్ట్ చేసే సిబ్బంది తొమ్మిది రకాల సూచనలను తప్పక పాటించాలని పేర్కొన్నారు. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రైతులకు సంబంధించిన ప్రతి అంశం వ్యవసాయాధికారులకు తెలిసి ఉండాలని చెప్పారు. ఏడీఏ సుజాత, తదితరులు పాల్గొన్నారు.


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మురళి

పేకాట స్థావరంపై దాడులు

కోవూరు: పాటూరులోని పంట పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్పెషల్ టీమ్ మెరుపు దాడులను మంగళవారం చేపట్టింది. పేకాటాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.95 వేల నగదు, 11 మొబైల్ ఫోన్లు, తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణకిషోర్‌రెడ్డి, కోవూరు ఎస్ఈబీ సీఐ నరహరి, జేడీ టీమ్ ఎస్సై బాలకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్, మస్తానయ్య, శ్రీనివాసులు, రాజు, సుమతి, తులసి, తదితరులు పాల్గొన్నారు.

